సాక్షి సంగారెడ్డి
బుధవారం ı 25 ı అక్టోబర్ ı 2023

న్యూస్‌రీల్

చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలి



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న సీఐ నాగరాజు, ఎస్‌ఐ అరుణ్ కుమార్

జోగిపేట (అందోల్): వచ్చే ఎన్నికల కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. స్టేషన్‌ల తనిఖీల్లో భాగంగా మంగళవారం జోగిపేట పీఎస్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, కేసు నమోదు వివరాలను పరిశీలించారు. రాజకీయ పార్టీ నేతలు, అనుచరులు ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ నాగరాజు, ఎస్‌ఐ అరుణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఓటమి భయంతోనే తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ నేత సంజీవరెడ్డి



నారాయణఖేడ్: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్‌లో ఉన్న తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్‌లోకి రావాలని కోరినా చేరని ఘనత తమ కుటుంబానిదేనన్నారు. అయినప్పటికీ తాను 5 సంవత్సరాల క్రితం మాట్లాడిన ఆడియో, వీడియోను సోషల్ మీడియాలో వక్రీకరించి అసత్యంతో పలువురు రాజకీయ నేతలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ విధంగా ప్రచారం చేస్తే సహించబోమని పేర్కొన్నారు. కేవలం ఓటమి భయంతోనే నాయకులు తప్పుడు ప్రచారాలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఖేడ్‌లో ఎగరేస్తామనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది భోజిరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు లోకేష్‌రెడ్డి, రాజు, సంగ్రాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దళితులకు 125 గజాల స్థలం

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడి డిమాండ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలో ఉన్న ముబారక్ పూర్‌లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అర్హులైన దళితులకు 125 గజాల ఇంటి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభుదాస్, పాపయ్య, రాబిన్, కృష్ణ, మధు, సామెల్, బాలరాజు, ప్రభాకర్, రాజు, చరణ్, సిమోన్, శివ, ప్రమోద్, ప్రణయ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలకు పరిష్కారం

పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్



చంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

జహీరాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ విమర్శించారు. మంగళవారం ఆయన సమక్షంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, ప్రజల సమస్యలు తీరుతాయని ఆయన నొక్కిచెప్పారు. భరత్‌నగర్‌కు చెందిన ఖదీర్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి అనుచరులతో పార్టీలో చేరారు. జన్‌సంగప్ప ఆధ్వర్యంలో కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పర్వత్ రెడ్డి, రంజోల్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.రాములు ఆధ్వర్యంలో సంఘం నాయకులు సైతం చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

రూ.50కోట్లతో బండ్లగూడ అభివృద్ధి : ఎమ్మెల్యే మహిపాల్

పటాన్‌చెరు: సీఎం నాయకత్వంలో ఈ పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఉన్న బండ్లగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్‌కు చెందిన యువ నాయకులు శివ, చందు, ఆసిఫ్ 100 మంది మిత్ర బృందంతో కలిసి ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం దశాబ్దంలో అన్ని వర్గాల ఆర్థిక అభ్యున్నతితోపాటు ప్రతి కాలనీ, గ్రామాన్నీ అభివృద్ధికి ప్రతీకగా నిలిపామని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన బండ్లగూడను రాష్ట్రం ఏర్పడిన అనంతరం రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను నిండు మనస్సుతో మూడోసారి ఆశీర్వదించి ఘన విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన యువకులందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వీరితో పాటు బీజేపీ సీనియర్ నాయకులు రాజు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, బండ్లగూడ అధ్యక్షుడు గోపాల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు



బాణసంచా కాంతులు



స్టేడియం గ్రౌండ్‌లో రావణుడి బొమ్మ దహనం



విజయ దశమి

సంగారెడ్డి పట్టణ వాసులు దసరా పండుగను సంబరంగా జరుపుకొన్నారు. స్టేడియం గ్రౌండ్‌లో రావణుడి కటౌట్‌ను ఏర్పాటు చేసి దహన కార్యక్రమం నిర్వహించారు. పటాసులు పేల్చారు. తారాజువ్వల కాంతులతో ఆకాశం హరివిల్లులా మారింది. ఈ సందర్భంగా వీక్షించేందుకు వచ్చిన ప్రజలతో ప్రాంగణమంతా కిక్కిరిసింది. కళాకారులు ఆలపించిన గీతాలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. ప్రజాప్రతినిధులు, సందర్శకులతో ప్రాంతమంతా సందడిగా కనిపించింది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

కాంగ్రెస్ హామీలన్నీ బూటకమే

- ఆచరణకు అమలుకానీ హామీలతో అభాసుపాలు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ప్రజా ఆశీర్వాద సభ స్థలాల పరిశీలన

నారాయణఖేడ్ : కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అక్కడి ప్రభుత్వం అమలు చేయలేక పోతోందని, తెలంగాణలో మోసపూరిత మాటలతో అధికారం కోసం తాపత్రయ పడుతోందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు దుయ్యబట్టారు. ఈనెల 30న నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొననుండగా మంగళవారం హెలిప్యాడ్, బహిరంగ సభ కోసం స్థలాలను పరిశీలించారు. కర్ణాటకలో ఆ పార్టీ అలవికానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఖేడ్ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉందని, ఇక్కడ ఆ పార్టీ ఇచ్చిన హామీలను ఎవరైనా గొప్పగా చెబితే వారిని ఒక వాహనంలో అక్కడి గ్రామాలకు తీసుకెళ్లి పరిస్థితిని చూపించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటుందో కేసీఆర్ చేసి చూపారని అన్నారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. మూడోసారి సీఎం నేతృత్వంలో బీఆర్‌ఎస్ గెలుపు ఆవశ్యకత గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చామని, తాగునీరు, 24 గంటల విద్యుత్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తానన్నారు.

కేవలం ప్రజల టీం

బీఆర్‌ఎస్ కేవలం ప్రజల టీం అని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఖేడ్‌లోని రహమాన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశం, అలయ్ బలయ్ కార్యక్రమాల్లో ప్రసంగించారు. ధరణి వల్లే రైతుబంధు నేరుగా రైతుల ఖాతాల్లో పడుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్ళీ కేసీఆర్‌నే సీఎం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు..కాంగ్రెస్ నేతలు అబద్ధాలతో అధికారం కోసం చూస్తున్నారని, ప్రజలు మాత్రం కేసీఆర్ పనితనాన్ని ఇష్టపడి పరితపిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ హయాంలో అమలవుతున్న పథకాలను ఈ సందర్భంగా వివరించారు. ఇంటింటికీ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను అతికించి గ్రామాల్లో అభివృద్ధిపై చర్చపెట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం, టీఎస్జీవోస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, రాష్ట్ర నాయకులు భిక్షపతి, మోహిద్ ఖాన్, రవీందర్‌నాయక్, నజీబ్, రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీఎం బహిరంగ సభకు సంబంధించి రహమాన్ ఫంక్షన్ హాల్ సమీపంలోగల స్థలాన్ని మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, నాయకులు పరిశీలించారు.



నారాయణఖేడ్ : ప్రజా ఆశీర్వాద సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్ రావు

హస్తం వస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థే

- బీజేపీని ప్రజలు నమ్మరు
- సీఎంను ప్రజలు శుభప్రదంగా మూడోసారి ఆశీర్వదిస్తారు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి టౌన్: కాంగ్రెస్ సర్కారు వస్తే మళ్లీ రాష్ట్రంలో పటేల్ పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చి రైతుల నుంచి భూమి శిస్తు వసూలు చేసేందుకు కుట్ర జరుగుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండలంలో ఉన్న ఫసల్వాది గ్రామానికి చెందిన డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం పార్టీ టికెట్ ఆశించి నిరాశ చెందగా మంత్రి స్వయంగా ఆయన ఇంటికెళ్లి చింతా అభ్యర్థి ప్రభాకర్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని మంగళవారం కోరారు. ఈ సందర్భంగా మాణిక్యంతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో సవ్యంగా తాగునీరు, కరెంట్ సరఫరా లేదన్నారు. అక్కడ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబీమా, దళితబంధు తదితర పథకాలు లేవని, కేవలం ఆసరా పింఛన్ రూ. 600 మాత్రమే ఇస్తున్నారని గుర్తు చేశారు. ధరణి వల్ల భూ సమస్యలు పరిష్కరించడంతో పాటు లంచాలు ఇచ్చే సంస్కృతికి చరమగీతం పాడామన్నారు. కేసీఆర్ ఈ పదేళ్లలో రైతుల భూమి శిస్తు మాఫీ చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో కరువు, కర్ఫ్యూ ఉంటే ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు కొనసాగుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. పట్నం మాణిక్యంకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఆయన అనుచరులకు సైతం పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు బీరయ్య యాదవ్, మామిళ్ల రాజేందర్, మనోజ్ రెడ్డి, నియోజకవర్గస్థాయి నాయకులు మాణిక్యం అనుచరులు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పట్నం మాణిక్యాన్ని కలిసిన మంత్రి హరీశ్‌రావు

బీఆర్‌ఎస్ వెంటే ప్రజలు

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు



బీఆర్‌ఎస్‌లో చేరిన కాశీంపూర్ గ్రామస్తులు

జహీరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.మాణిక్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కాశీంపూర్ గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఇచ్చే కల్లబొల్లి హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు. కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణలోనే ఇలాంటి పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజలు సైతం బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారన్నారు. గ్రామానికి చెందిన మహబూబ్, అలీషా, ఇమ్రాన్, ఇర్ఫాన్, సమీర్, వాజీద్, సరా పార్టీలో చేరారు. అల్లీపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది బెంజిమెన్‌రాజు, తన అనుచరులు సైతం కాంగ్రెస్‌కు రాజీనామా చేసి చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు తంజీం, విజేందర్‌రెడ్డి, అర్షద్, శివ, భాస్కర్, మచ్చేందర్, నసీర్, రమేష్, విల్సన్‌లు పాల్గొన్నారు.

గ్యాన్యూ్యాల్స్‌లో అగ్ని ప్రమాదం



మృతుడు సత్యేంద్రసింగ్



యాజమాన్యంతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

- కార్మికుడి మృతి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- బాధిత కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో ఉన్న పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం తెల్లవారుజాము మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కార్మికుడు మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. బొంతపల్లి పారిశ్రామిక వాడలో గల గ్యాన్యూ్యాల్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ హెచ్‌బ్లాక్‌లోని రియాక్టర్ వద్ద కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము 2 గంటల సమయంలో రియాక్టర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న డ్రమ్ముల నుంచి రసాయన ఘాటు వాసనలు వెలువడ్డాయి. యూపీ రాష్ట్రం ఝాన్సీ జిల్లా పండరి గ్రామానికి చెందిన సత్యేంద్ర సింగ్(36) స్పృహ తప్పి పడిపోయాడు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్మికుడి కుటుంబానికి రూ.50లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని గుమ్మడిదల ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

బాలవికాస్‌లో లెక్కలు గోల్‌మాల్

అక్రమాలు ఆపాలంటూ గ్రామస్తుల నిరసన

మద్దూరు(హుస్నాబాద్): తమ గ్రామ పరిధిలోని బాలవికాస కేంద్రంలో లెక్కలు గోల్‌మాల్ అవుతున్నాయని లద్నూర్ గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీటి ప్లాంట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపంచాయతీ కార్యాలయానికి అందజేయడంలేదని, ఆదాయం, ఖర్చుల వివరాలు సైతం తెలపడంలేదని మండిపడ్డారు. 2020 నుంచి నేటి వరకు బాలవికాస వాటర్ ప్లాంట్ ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయతీకి సగం ఇవ్వాలని, కానీ ఇంతవరకు చూపడం లేదన్నారు. ఇప్పటి వరకు ఎంత ఆదాయం వచ్చిందో వెల్లడించాలన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సుదర్శన్ బాలవికాస ప్లాంట్ వద్దకు చేరుకొని, బాలవికాస సంస్థ నిర్వాహకులకు ఫోన్ చేయగా ఈ నెల 27న గ్రామానికి వచ్చి పూర్తి లెక్కలు వెల్లడిస్తామని సమాధానమిచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సయోధ్య

- ముఖ్యనేతల మధ్య రాజీ
- ప్రభాకర్‌తో కలిసి పని చేసేందుకు పట్నం సిద్ధం
- మాణిక్యం నివాసానికి వెళ్లిన మంత్రి హరీశ్‌రావు, చింతా

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : అధికార బీఆర్‌ఎస్‌లో రేగిన అసమ్మతి సెగలు చల్లారాయి. ఆ పార్టీ ముఖ్య నేతల్లో నెలకొన్న విభేదాలు సమసిపోయాయి. సంగారెడ్డి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడి అసమ్మతి గళం వినిపించిన డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మంగళవారం మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్ ముఖ్యనేతలు ఆయన నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. అనంతరం ఈ మేరకు ప్రకటన చేశారు. సీనియర్ నాయకులు మాణిక్యం.. చింతా గెలుపుకోసం క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించారని మంత్రి ప్రకటించారు. ఈసారి ఎలాగైన సంగారెడ్డిపై కూడా గులాబీ జెండాను ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి టికెట్ చింతా ప్రభాకర్‌కు దక్కగా మాణిక్యం అసమ్మతి గళం వినిపించడం విదితమే. తన సొంత గ్రామం ఫసల్‌వాదీలో కార్యకర్తలతో సమావేశంలో, ఇటీవల ఆయన పుట్టిన రోజు వేడుకల్లోనూ ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో బరిలో ఉంటానని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి హరీశ్ బుజ్జగించారు. సముచిత రీతిలో గౌరవించుకుంటామని ఆయనకు హామీ ఇచ్చారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న మాణిక్యం తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి పని చేశారని, మంచి అనుభవం ఉన్న నాయకుడని అన్నారు. మరోవైపు పట్నం.. వెంట ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ప్రభాకర్ గెలుపు కోసం పని చేయాలని నిర్ణయించారు.

హరీశ్‌రావును కలిసిన కాంగ్రెస్ నేత ముఖీం..

సంగారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కాంగ్రెస్ సంగారెడ్డి టికెట్ ఆశించిన అడ్వొకేట్ ముఖీం మంత్రి హరీశ్‌రావును కలిశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి పోటీగా ఆయన టికెట్ రేసులో ఉండటం తెలిసిందే. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు కూడా. కానీ అధిష్టానం జగ్గారెడ్డి వైపే మొగ్గు చూపింది. దీంతో తన అనుచరులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన ముఖీం మంత్రిని కలవడం హస్తంలో కలకలం రేపుతోంది. ఒకట్రెండు రోజుల్లో బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు సదాశివపేటలో బహిరంగసభను ఏర్పాటు చేసి అక్కడే ఆయన గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా జిల్లా కేంద్ర రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి.

క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఆదరించాలి

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



పార్టీ కండువా కప్పుతున్న క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరించి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రతీ గ్రామంలో సుమారు కోటి రూపాయలకు పైగా అభివృద్ధి జరిగిందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అమలు కాని హామీలు : ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

చేగుంట(తూప్రాన్): కర్ణాటకలో అమలు కాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు ఎలా అమలు చేస్తారని, వారివి అన్నీ అమలు కాని పథకాలని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట, నార్సింగి, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీలో కేడర్ లేదు కాంగ్రెస్‌కు లీడర్లు లేరని ప్రజలు మాయ మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. పార్టీలో చేరిన నాయకులు పాత నాయకులను కలుపుకొని దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డితోపాటు భారతీయ కిసాన్‌సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తు రాజిరెడ్డితో నార్సింగి, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల శాఖ అధ్యక్షులు రణం శ్రీనివాస్, రాజేశ్, నారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



కోడూరులో రావణుడి కటౌట్ దహనం

సంగారెడ్డి/జహీరాబాద్: దసరా పండుగను జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. గ్రామాల్లో రావణాసుర దహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పాలపిట్ట చూసి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జహీరాబాద్ పట్టణంలో మంగళవారం రాత్రి రావణ దహనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు.

కొత్త కొత్తగా..

- ఎన్నికల నిర్వహణకు ఈసీ ప్రత్యేక చర్యలు
- పారదర్శకత, పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం
- కొత్తగా యాప్ అందుబాటులోకి..
- ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు
- నియోజకవర్గానికి ఒక యూత్ పోలింగ్ కేంద్రం

జహీరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా జరపడంతోపాటు పోలింగ్ శాతం పెంచేందుకు వీలుగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఇందు కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది. గతంలో నిర్వహించిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో మరిన్ని నూతన పద్ధతులు, విధానాలను ప్రవేశపెడుతోంది.

'మై ఓటరు హెల్ప్‌లైన్ యాప్' అందుబాటులో



గతంలో ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో మై ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డు ఏపిక్ నంబరు అందులో నమోదు చేస్తే ఓటు వేసే పోలింగ్ కేంద్రం వివరాలు తెలుస్తాయి.

ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు

పార్టీ అభ్యర్థిని గుర్తించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈవీఎంలలో స్వల్ప మార్పులు చేసింది. గతంలో ఓటింగ్ యంత్రాలపై పార్టీ గుర్తు, అభ్యర్థిపేరు మాత్రమే ఉండేవి. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఫొటోలు కూడా పెట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పోస్టల్ బ్యాలెట్ పైనా ముద్రించేందుకు చర్యలు చేపట్టింది.

అకౌంటింగ్ బృందాల ఏర్పాటు

ఎన్నికల సమయంలో ఖర్చు నియంత్రణ అనేది లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఖర్చులను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మొదటిసారిగా నియోజకవర్గానికి ఒక అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలనకు 15 రోజులకు ఒకసారి వివరాలు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రచారంతో పాటు ఇతరత్రా కార్యక్రమాలకు చేస్తున్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్ బృందాలు పరిశీలించనున్నాయి.

యూత్ పోలింగ్ కేంద్రాలు..

దివ్యాంగులు, మహిళల ఓటు శాతం పెంచేందుకు గతంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని యువ అధికారులే నిర్వహించనున్నారు. మొదటిసారి నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు చేయనున్నారు.

ముందుగానే పోస్టల్ బ్యాలెట్..

ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ఈ దఫా పోలింగ్ ప్రక్రియకు ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. గతంలో పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో అవకాశం కల్పించే వారు. పోలింగ్ రోజు వార్తల సేకరణలో ఉండే జర్నలిస్టులతోపాటు 12 అత్యవసర సేవా రంగాల ఉద్యోగులు సైతం ఇక పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో పనిచేసే సిబ్బంది, సర్వీస్ ఓటర్లు(సాయుధ బలగాలు) ప్రవాస ఓటర్లకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ఉండేది. 40 శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన ఓటర్లకు ప్రస్తుతం ఇంటి నుంచే పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారు. నవంబర్ 7వ తేదీ లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు ఎత్తుగడ
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు గాలం..?
- చిలుముల సుహాసినిరెడ్డికి పార్టీలోకి ఆహ్వానం
- పావులు కదుపుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి



ఎమ్మెల్యే హన్మంతరావు, కాంగ్రెస్ నేతలకు స్వాగతం పలుకుతున్న సుహాసినిరెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు పరిశీలిస్తే.. హన్మంతరావు మెదక్‌తో పాటు నర్సాపూర్ నియోజకవర్గంపై దృష్టి సారించి.. అధికార పార్టీకి చెక్ పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది.

చిలుముల కుటుంబానికి గాలం

సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి వంశీయులను తమ పార్టీలో చేర్చుకునేందుకు హన్మంతరావు పావులు కదుపుతున్నారు. మంగళవారం ఆయన కొడిపల్లి పర్యటన ఇందుకు రుజువు చేస్తుంది. మదన్‌రెడ్డి సమీప బంధువు, మాజీ ఎంపీటీసీ చిలుముల సుహాసినిరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులతో కలసి ఆమెను కలిశారు. కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె ప్రస్తుతం రాజకీయాల్లో ప్రత్యక్షంగా లేకపోయినా.. గతంలో బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పని చేశారు. పార్టీలో చేరితే సముచిత స్థానం లభిస్తుందని హన్మంతరావు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. కార్యకర్తలతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తానని సుహాసినిరెడ్డి చెప్పడం గమనార్హం.

టికెట్ కోసం మైనంపల్లిని కలిశారా..?

తనకు టికెట్ రాదని తెలిసిన తర్వాత ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన ఓ బీఆర్ఎస్ ముఖ్య నాయకుడితో కలసి ఎమ్మెల్యే హన్మంతరావును హైదరాబాద్‌లో కలిసినట్లు సమాచారం. తనకు కాంగ్రెస్‌లో టికెట్ ఇప్పించాలని అడిగినట్లు ప్రచారం జరిగింది. టికెట్ కోసం మీరే ప్రయత్నం చేసుకోవాలని, పార్టీ టికెట్ ఇస్తే తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిసింది. అయితే మదన్‌రెడ్డి మాత్రం తాను బీఆర్ఎస్‌ను వదలనని చెప్పడం చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ టికెట్ ఎవరికి?

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేయడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థుల మొదటి జాబితాలో నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించలేదని తెలిసింది. మరోవైపు చిలుముల సుహాసినిరెడ్డికి మైనంపల్లి హామీ ఇవ్వడంతో ఆమెకు నర్సాపూర్ టికెట్ ఇస్తారా? లేక మరేదైనా పదవి ఇస్తారా? అనే చర్చసాగుతోంది. అలాగే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న గాలి అనిల్‌కుమార్, ఆవుల రాజిరెడ్డిలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇన్ని పరిణామాల మధ్య అసలు నర్సాపూర్ టికెట్ ఎవరికి వస్తుందోననే నాయకులు, కార్యకర్తలు సందేహాలకు పార్టీ అధిష్టానమే తెరదించాలి.

సముచిత స్థానం ఇస్తాం..

కొడిపల్లి(నర్సాపూర్): మీ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మోసం చేసింది.. కాంగ్రెస్ పార్టీలోనికి రండి సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తాం అని ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ మాజీ మహిళా అధ్యక్షురాలు, దివంగత మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కోడలు చిలుముల సుహాసినికిషన్‌రెడ్డి, ఆమె కొడుకు చిలప్‌చెడ్ మండల మాజీ జెడ్పీటీసీ చిలుముల శేషసాయిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కోరారు. మంగళవారం కొడిపల్లిలోని సుహాసి ఇంటికి మైనంపల్లితోపాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, నాయకులు గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ డెలిగెట్ ఆంజనేయులుగౌడ్ నియోజకవర్గ పరిశీలకులు భూపతిరెడ్డి తదితరులు వెళ్లి కలిశారు. కార్యకర్తలు అభిమానులతో చర్చించి పార్టీ మారే విషయంపై నిర్ణయం తీసుకుంటామని సుహాసినికిషన్‌రెడ్డి, శేషసాయిరెడ్డి తెలిపారు. పదవులు ముఖ్యం కాదని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేసేందుకు మంచి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల అధ్యక్షులు శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, రఘు, పాష, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు క్రిష్ణాగౌడ్, సుధీర్ రెడ్డి,పాల్గొన్నారు.

అన్ని విజయాలే కలగాలి

- సిద్దిపేట సీపీ శ్వేత
- సాయుధ దళ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: విజయదశమి నుంచి అన్ని విజయాలు కలగాలని సిద్దిపేట సీపీ శ్వేత ఆకాంక్షించారు. పండుగను పురస్కరించుకుని, దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పెద్ద కోడూర్ గ్రామ శివారులోని సాయుధ దళ కార్యాలయంలో మంగళవారం ఆయుధ పూజ, ప్రభుత్వ వాహనాలకు, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు సీపీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేసే ప్రతీ పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రాంచందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాసరావు, మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, పూర్ణచందర్, ప్రసాద్, రాజేష్, ఆర్ఎస్ఐలు సాయిప్రసాద్, రోహిత్, సురేష్‌కుమార్, రంజిత్, నిరంజన్, సాయిచరణ్, మహిళ ఆర్ఎస్ఐ పుష్ప, చిన్నకోడూర్ ఎస్ఐ సుభాష్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోపాలను పరిశీలించడానికే..

- కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించామని ప్రచారం చేసుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను స్వయంగా పరిశీలించేందుకు బుధవారం రైతులతో కలిసి తరలివెళ్తున్నట్లు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలోని రైతులు, మేధావులు, కాంగ్రెస్ నాయకులతో వెళ్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని సాంకేతిక సమస్యలు, జరుగుతున్న వాస్తవాలను గమనించి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు చూపిస్తామన్నారు. ప్రాజెక్టులో నాణ్యత లోపం, ప్రజా ధనం వృథా అయినట్లు స్పష్టంగా కనబడుతుందన్నారు. దీనిపై విచారణ జరిపించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుకంజ వేస్తుందన్నారు.సందర్శనకు మేధావులు, రైతులు, యువకులు స్వచ్ఛందంగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు దాసరి భూమయ్య, కుమారస్వామి, రజిత, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌కు ఆయుధం

హుస్నాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విజయ దశమి సందర్భంగా పొన్నం ప్రభాకర్ దంపతులు శమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. చెడు వదిలి విజయం దిశగా హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ముందుకు వెళ్లాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో ధైర్యంగా ప్రజల ముందుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎండీ హస్సేన్, యాదవరెడ్డి, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల పార్టీ అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, మంద ధర్మయ్య, కౌన్సిలర్ చిత్తారి పద్మ, నాయకులు పాల్గొన్నారు.

బాలికపై బాలుడు అత్యాచారం

మద్దూరు(హుస్నాబాద్): బాలికపై బాలుడు అత్యాచారం చేసిన ఘటన దూళ్మిట్ట మండల పరిధిలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. దూళ్మిట్ట మండల పరిధిలోని ఓ గ్రామంలో ఈ నెల 16న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్రామానికి చెందిన బాలుడు అత్యాచారం చేశాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉంటున్న బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లగా అత్యాచారం జరిగినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం పై పోలీసులను వివరణ కోరగా సదరు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



కుమార్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిప్పల్‌తుర్తిలో సోమవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన కురుమ కుమార్ (31) ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మల విసర్జన కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం చెరువులో మృతి చెంది కనిపించాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఎనిమిదేళ్ల ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అదృశ్యమైన యువకుడు.. శవమై



అజీజ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: కనిపించకుండా పోయిన యువకుడు చెరువులో శవమై తేలిన ఘటన నర్సాపూర్‌లో మంగళవారం వెలుగు చూసింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన ఎండీ అజీజ్ (26) ఎలక్ట్రీషన్ (మెకానిక్) షాప్ నడుపుకుంటున్నాడు. రోజులాగే సోమవారం షాప్‌కు వెళ్లి అజీజ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం నర్సాపూర్ రాయరావు చెరువులో శవమై కనిపించాడు. మృతుడి తల్లి పర్వీన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

రాష్ట్రంలో మద్యానికే ప్రాధాన్యం

- నిరుద్యోగులను పట్టించుకోని కేసీఆర్
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్రంలో మద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు ఇవ్వలేదని, నిరుద్యోగులను భిక్షగాళ్లుగా మార్చారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. మంగళవారం ముత్యంపేట, సూరంపల్లి, లింగరాజుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కుడి చేతితో పింఛన్ ఇస్తూ.. ఎడమ చేతితో మద్యంపై డబ్బులు వసూలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. దళితబంధు, బీసీ బంధు బీఆర్ఎస్ నాయకులకే వచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించిన పార్టీ బీజేపీ పార్టీయేనని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్, పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్‌రావు, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, కుమ్మరి నర్సింహులు, ముత్యాల శ్రీనివాస్, లింగారాజుపల్లి సర్పంచ్ కేత కనకరాజు, సూరంపల్లి ఉపసర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

ఒకే వేదికపై బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్, వేదికపై ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

రావణదహనంలో పాల్గొన్న నేతలు

జహీరాబాద్: దసరా వేడుకల్లో పాల్గొన్న ఆయా పార్టీల అభ్యర్థులు ఒకే వేదికను పంచుకున్నారు. మంగళవారం రాత్రి జహీరాబాద్‌పట్టణంలోని శివాలయం వద్ద నిర్వహించిన రావణదహనం కార్యక్రమ వేడుకల్లో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ ఒకే వేదికను పంచుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంతే కాకుండా బీజేపీ టికెట్‌ను ఆశిస్తున్న ఢిల్లీ వసంత్, రాంచందర్ రాజనర్సింహా, సుధీర్‌కుమార్‌లు సైతం వారితో వేదికపై ఆశీనులయ్యారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా జరిగిన కార్యక్రమంలో దసరా పండుగ ప్రాముఖ్యత గురించి ఆయా పార్టీల అభ్యర్థులు, నేతలు వివరించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, వేడుకల కమిటీ చైర్మన్ అల్లాడి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు మంకాల్ సుభాష్, జి.గుండప్ప, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మురళీ కృష్ణాగౌడ్, ఎం.జి.రాములు, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు వెళ్లి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



యాదగిరి మృతదేహం

రాయపోలు(దుబ్బాక): పండుగ పూట స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన రాయపోలు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోలుకు చెందిన అరికెల యాదగిరి (48)కి దసరా రోజు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఫోన్ రాగా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9.30కి కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్నేహితులతో మద్యం తాగుతున్నట్లు తెలిపారు. ఎంతసేపు అయినా ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం ఉదయం రాయపోలు వైన్స్ షాపు ఎదుట ఉన్న డబ్బాల నడుమ యాదగిరి మృతి చెంది కనిపించాడు. భార్య పుణ్యవతితోపాటు కుటుంబసభ్యులు వెళ్లి రోదించారు. మృతుడి ఫోన్ గ్రామానికి చెందిన కుర్మ శంకరయ్య వద్ద ఉండగా అతడితో పాటు యాదగిరితో కలిసి మద్యం సేవించిన వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండుగపూట విషాదం

- చెట్టును ఢీకొట్టిన బైక్
- యువకుడు మృతి
- రెండు చోట్ల గుండెపోటుతో ఇద్దరు



ప్రతాప్ (ఫైల్)



నరేశ్ (ఫైల్)



నరేశ్ (ఫైల్)

దసరా రోజు పలు గ్రామాల్లో విషాదచాయలు అలముకున్నాయి. బైక్‌పై రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో రెండు చోట్ల గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతి చెందారు.

మిరుదొడ్డి(దుబ్బాక): చెట్టును బైక్ ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిట్ల మణెమ్మ రత్నం దంపతుల పెద్ద కొడుకు ప్రతాప్(28) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో కాసులాబాద్ నుంచి బైక్‌పై బయలు దేరాడు. మండల పరిధిలోని ధర్మారం గ్రామ శివారులోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు హెల్మెట్ ఉన్నా ఫలితం లేకపోయింది. మృతుడి తండ్రి రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్ఐ నరేశ్ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు

అప్పటిదాకా దసరా పండుగ ఉత్సాహంగా జరుపుకున్న ఆ యువకుడిపై మృత్యువు గుండె పోటుతో కబళించింది.ఈ ఘటన మండల పరిధిలోని చెప్యాలలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాటి బాలవ్వ, లక్ష్మయ్య దంపతుల రెండో కుమారుడు నరేశ్ (33) ఫౌల్ట్రీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. దసరా పండుగ అనంతరం ఇంట్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సందడిగా ఉన్న క్రమంలో నరేశ్ ఒక్కసారిగా గుండె పోటుతో కుప్ప కూలిపోయాడు. హుటాహుటినా నరేశ్‌ను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ముంపు గుడాటిపల్లిలో మరొకరు..

అక్కన్నపేట(హుస్నాబాద్): దసరా పండుగ రోజు యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన అక్కన్నపేట మండలం ముంపు గుడాటిపల్లి గ్రామం తెనుగుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనుగుపల్లికి చెందిన సుంకరి నరేశ్ (26) అనే యువకుడు పండుగ సందర్భంగా సోమవారం బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం తింటున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పోవడంతో హుటాహుటినా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు.